

పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న సిటీ ఈఆర్వో వెంకటరావు


కుటుంబ సభ్యులతో ఓటు వేసిన సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

‘ఓటెత్తిన’ చైతన్యం

- కాకినాడ సిటీలో 71.5 శాతం పోలింగ్
- ఉదయం 7 నుంచే బారులు తీరిన జనం
- చిన్నపాటి ఘటనలు మినహా ప్రశాంతం
- ఓటు వేసిన సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి


సాయంత్రం ఆరు గంటలకు రేచర్లపేట సీబీఎం స్పెషల్ మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ వద్ద ఓట్లు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

కాకినాడ: కాకినాడ సిటీ నియోజకవర్గంలో ఓట్ల పండుగకు జనం బారులు తీరారు. ఉదయం 7 గంటల నుంచే ఓటు వేసేందుకు క్యూకట్టారు. ఓ వైపు విపరీతమైన ఎండలో తొలి గంటలోనే ఓటు ప్రక్రియ పూర్తి చేసుకోవాలనే సంకల్పంతో పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. చెదురు, మదురు ఘటనలు మినహా అక్కడక్కడ టీడీపీ నేతల కవ్వింపు చర్యలు మినహా మొత్తం మీద పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు పర్యవేక్షణలో ఉదయాన్నే ఈవీఎం, వీవీ ప్యాట్, ఇతర ఎన్నికల సామగ్రిని సిద్ధం చేశారు. తొలుత మాక్ పోలింగ్ నిర్వహించారు. రాత్రి 7 గంటల తరువాత కూడా పలు పోలింగ్ స్టేషన్లలో ఓటర్లు బారులు తీరి ఉండడం కనిపించింది.

మండుటెండల్లో ఓటు కోసం...

ఓ వైపు మండుటెండతో చమటలు కక్కుతూనే జనం ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉత్సాహాన్ని చూపించారు. కొన్నిచోట్ల రెండేసి గంటల పాటు ఓటు కోసం వేచి ఉన్నారు. అనేక పోలింగ్ స్టేషన్ల వద్ద టెంట్‌లు, మంచినీరు వంటి సదుపాయాలు కల్పించినప్పటికీ అక్కడక్కడ వీటి కొరత కూడా కనిపించడంతో జనం ఇబ్బందులు పడ్డారు. విషయాన్ని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఆర్వో వెంకటరావు దృష్టికి తీసుకువెళ్లారు.

యువ, ప్రవాస ఓటర్ల రాక

కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్న యువ ఓటర్లు, పొరుగు రాష్ట్రాలు, పొరుగు జిల్లాల్లో ఉంటూ ఇక్కడ ఓటు కలిగిన అనేక మంది ఓటర్లు ఈసారి పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటు వేయడం కనిపించింది. కాగా యువ ఓటర్లు, మహిళలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక పోలింగ్ స్టేషన్లను కూడా ఏర్పాటు చేయడంతో అక్కడ ప్రశాంత వాతావరణంలో ఓటు వేశారు.

తుది సమాచారం అందే సమయానికి 71.5 శాతం పోలింగ్

కాకినాడ సిటీ నియోజకవర్గంలో పోలింగ్ 67.89 శాతం నమోదైంది. మొత్తం 234 పోలింగ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 7 గంటలకు ప్రారంభమై రాత్రి 7 గంటల తరువాత కూడా కొన్నిచోట్ల పోలింగ్ కోసం వచ్చిన ఓటర్లు నిలిచిపోవడంతో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. అలాగే దుమ్ములపేటలోని ఓ పోలింగ్ బూత్‌లో రాత్రి 11 గంటల వరకు ఓటింగ్ సాగింది.

పోలింగ్ స్టేషన్ల సందర్శన

వైఎస్సార్‌సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సోమవారం పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. అక్కడ ఓటింగ్ సరళిని పరిశీలించారు. కొన్నిచోట్ల టెంట్‌లు, మంచినీటి సమస్య కనిపించడంతో అక్కడి నుంచే అధికారులతో మాట్లాడారు.

ఓటు వేసిన సునీల్, ద్వారంపూడి

కాకినాడ వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ గంగరాజునగర్‌లోని పోలింగ్‌బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి స్థానిక ఆనంద్ థియేటర్ సమీపంలోని గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్‌లో భార్య మహాలక్ష్మి, కుమార్తెలు డాక్టర్ ప్రణీత, డాక్టర్ అంజనితో కలిసి ఓటు వేశారు.


పోలింగ్ అనంతరం ఈవీఎం, వీవీ ప్యాట్‌లను భద్రపరిచే ఏర్పాట్లపై రిసెప్షన్ కౌంటర్ వద్ద పరిశీలిస్తున్న ఆర్వో వెంకటరావు


పోలింగ్ కోసం బారులు తీరిన ప్రజలు

వైఎస్సార్ సీపీ వైపే ఓటరు చూపు

- అదే ఆకాంక్ష బూత్‌లలో కనిపించింది
- కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబు
- కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగం
- వలసపాకలలో ఓటు వేసిన ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్


కాకినాడ అర్బన్ 1వ డివిజన్‌లో కుటుంబ సభ్యులతో కలసి ఓటు హక్కు వినియోగించుకున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు


వలసపాకలలో ఓటు వేసి వేలిని చూపుతున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్

కాకినాడ రూరల్: మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని, వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండాలనే ఆకాంక్ష ఓటర్లలో స్పష్టంగా కనిపించిందని వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని కాకినాడ అర్బన్ రమణయ్యపేట 1వ డివిజన్‌లో సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి కన్నబాబు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పోలింగ్‌లో పెద్ద ఎత్తున అన్ని వర్గాల ప్రజలు పాల్గొని ఓటు హక్కు వినియోగించుకుంటున్నారన్నారు. ముఖ్యంగా మహిళలు ఎక్కువగా హాజరయ్యారన్నారు. ప్రజల మనసులో వైఎస్సార్ సీపీ, జగన్‌మోహన్ ఉన్నారన్నారు. కాకినాడ రూరల్, కాకినాడ పార్లమెంట్‌లో, జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో అత్యధిక మెజార్టీతో వైఎస్సార్ సీపీ గెలవబోతోందని పోలింగ్ సరళిని బట్టి అర్థమవుతోందన్నారు.

వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ వలసపాకల గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. సునీల్‌తో పాటు జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ తదితరులు ఓటు హక్కు వలసపాకలలో వినియోగించుకున్నారు.

కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి పంతం నానాజీ కాకినాడ అర్బన్ 9వ డివిజన్‌లో ఓటు హక్కును కుమారుడితో కలసి వినియోగించుకున్నారు.

ఓటు వేయాలన్నదే సంకల్పం

- జాప్యాన్ని పట్టించుకోకుండా ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజలు
- చీకటి పడినా పలుచోట్ల పోలింగ్
- నియోజకవర్గంలో 74 శాతం పోలింగ్


కాకినాడ రూరల్ మండలం సూర్యారావు పేటలో రాత్రి వరకు కొనసాగిన పోలింగ్

కాకినాడ రూరల్: ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. ఓటు అనే ఆయుధంతో ఐదేళ్ల పాటు పాలించే ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. పోలింగ్ సరళి జాప్యమవుతున్నా గంటల తరబడి క్యూలైన్‌లో ఓపికగా ఉండి ఎన్నికల బరిలోని అభ్యర్థుల భవితవ్యం తేల్చేందుకు ఓటు హక్కును వినియోగించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల పోరులో భాగంగా కాకినాడ రూరల్ నియోజకవర్గంలో స్వల్ప సంఘటలను మినహా పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. నియోజకవర్గం మొత్తం మీద 74 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు తెలిపారు.

నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,69,330 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా ఓటు హక్కు వినియోగించునేందుకు 264 పోలింగ్ కేంద్రాలను కాకినాడ రూరల్, కరప మండలాలతో పాటు కాకినాడ అర్బన్‌లోని 8 డివిజన్లలో ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రమే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది ఉదయం 6 గంటలకు పార్టీల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించిన అనంతరం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగం కోసం పెద్ద ఎత్తున ఓటర్లు తరలివచ్చారు. ఉదయమే వీరంతా పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడంతో సందడి నెలకొంది. ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం నుంచి ఓటర్లు భారీగా తరలిరావడంతో ఓటు హక్కు వినియోగానికి జాప్యం జరిగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్యూలైన్లలోనే నిలబడి పోయారు. మధ్యాహ్నం నుంచి కొన్ని కేంద్రాల వద్ద జనం తగ్గుముఖం పట్టారు. రమణయ్యపేట కొత్తూరు, వాకలపూడి పంచాయతీ వద్ద, సూర్యారావుపేట, సర్పవరం, గంగనాపల్లి, కాకినాడ అర్బన్ 2వ డివిజన్ తదితర చోట్ల సాయంత్రం 6 గంటలకు కూడా ఎక్కువ మంది ఉండిపోవడంతో వారంతా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. దీంతో రాత్రి వరకు పోలింగ్ జరిగింది. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను జేఎన్‌టీయూకేలో భద్రపరచనున్నారు.


రమణయ్యపేట కొత్తూరు వద్ద సాయంత్రం 5 గంటలకు క్యూలైన్‌లో బారులు తీరిన ఓటర్లు


వలసపాకల పంచాయతీ వద్ద సాయంత్రం 5.30 గంటలకు ఖాళీగా ఉన్న పోలింగ్ కేంద్రం

రాత్రి వరకూ సాగిన పోలింగ్

నియోజకవర్గంలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగియాల్సి ఉంది. పోలింగ్ జాప్యం కారణంగా క్యూ లైన్లలో ఉన్న ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు రాత్రి 11 గంటలు నిరీక్షించాల్సి వచ్చింది. నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,69,330 మంది ఓటర్లు ఉండగా వీరిలో అత్యధికంగా మహిళలు 1,35,847 మంది, పురుషులు 1,33,475 మంది, ఇతరులు 8 మంది ఉన్నారు. ఉదయం నుంచి పోలింగ్ సరళి ఇలా ఉంది. పోలింగ్ ప్రారంభమయినప్పటి నుంచి ప్రతి రెండు గంటలకు పోలింగ్ సరళి ఇలా ఉంది.

ఉదయం 9 గంటలకు 9.43శాతం, 11 గంటలకు 25.01 శాతంతో 67,359 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 1 గంటకు 40.84 శాతంతో 1,09,994 మంది, మధ్యాహ్నం 3 గంటలకు 52.01 శాతం అనగా 1,40,079 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 4 గంటలకు 88.71 శాతం, సాయంత్రం 6 గంటలకు 67.08 శాతంతో 1,80,667 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాత్రి 7.30 గంటకు 71.3 శాతం పోలింగ్ నమోదైంది. సుమారు 15 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ రాత్రి వరకు కొనసాగింది.


కాకినాడ రూరల్ వాకలపూడి పంచాయతీ వద్ద ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

క్లుప్తంగా

పరీక్షా ఫలితాల్లో నవోదయ విద్యాలయ రికార్డు

యానాం: 10వ, 12వ తరగతి వార్షిక పరీక్షా ఫలితాల్లో యానాం జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు సోమవారం తెలిపారు. 10వ తరగతిలో యు.సుహితా ఏంజెల్ 98.40 శాతంతో ప్రథమ, ఎస్ఎస్‌వీ సాయిప్రణీత్ 94.50 శాతంతో ద్వితీయ, వి.త్రినయ్ సాయిచరణ్ 94.30 శాతంతో తృతీయ స్థానాలు సాధించారన్నారు. 12వ తరగతిలో కె.విశాలాక్షి భవ్య 91.80 శాతం, ఆదిత్య రంజన్‌నాగ్ 91 శాతం, పి.ప్రశాంత్‌కుమార్ 90.60 శాతం మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. 12వ తరగతిలో పరీక్ష రాసిన 34 మంది విద్యార్థులందరూ డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారన్నారు. విద్యాలయ చరిత్రలోనే ఇది అత్యుత్తమ రికార్డు అని చెప్పారు. సహకరించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఆయన అభినందించారు.

సీఎం రంగసామికి పనసకాయల అందజేత


సీఎం రంగసామికి పనస కాయలను అందజేసిన ఎమ్మెల్యే కల్యాణసుందరం

యానాం: పుదుచ్చేరి రీజియన్ పరిధిలోని కాలపట్టు నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్న శాసనసభ్యుడు కల్యాణ సుందరం సీఎం రంగసామికి సోమవారం పనస కాయలు అందజేశారు. కల్యాణసుందరం తన పొలంలో పనసతో పాటు అరటి, మామిడి తదితర ఉద్యానవన పంటలను పండిస్తున్నారు. అదేవిధంగా అందమైన మొక్కలు, పుష్పాలతో కూడిన గార్డెన్‌ను ఆయన తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో ఆయన తన పొలంలో పండిన పండ్లను మిత్రులకు, సహచర శాసనసభ్యులకు ఏటా పంపిస్తుంటారు. తాజాగా సీఎం రంగసామికి అందజేశారు.

కరప మండలంలో 80 శాతం పోలింగ్


కరపలో బారులుతీరిన ఓటర్లు

కరప: మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. చెదురు మదురు సంఘటనలు మినహాయించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పోలింగ్ ముగిసింది. కొన్ని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు ఉదయం కొంతసేపు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. సరాసరిన 80 శాతం ఓటింగ్ నమోదయింది. మండలంలోని 23 గ్రామాల్లో ప్రజలు 66 పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. 64,475 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోవాల్సి ఉండగా 51,580 మంది ఓటు వేశారు. మండలంలోని కరప, కూరాడ, వాకాడ, వేళంగి గ్రామాల్లో 89 శాతం నమోదైంది. మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు స్వగ్రామమైన సిరిపురంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కరపలో దివ్యాంగులు ఓటు వేయడానికి వచ్చేందుకు రెవెన్యూ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వీల్‌చైర్లు ఏర్పాటు చేసి, పోలింగ్ కేంద్రంలోకి తీసుకు వెళ్లి ఓటేసేందుకు వీలుగా ఫెసిలిటేటర్లను ఏర్పాటు చేశారు. కరప, వాకాడ, వలసపాకల గ్రామాల్లో రాత్రి 7.30 వరకు పోలింగ్ జరగగా కూరాడలో రాత్రి 9 గంటలకు కూడా ఓటర్లు లైన్‌లో నిలబడి ఉన్నారు. మండల ఎన్నికల అధికారులైన ఎంపీడీఓ కె.అప్పారావు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఈఓ పీఆర్డీ బీపీ సత్యనారాయణ, ఆర్ఐ పేపకాయల మాచరావు పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. సీఐలు కె.శ్రీనివాస్, ఈశ్వరరావుల పర్యవేక్షణలో కరప ఎస్ఐ టి.రామకృష్ణ పోలీసు సిబ్బందితో కలసి గ్రామాల్లో తిరుగుతూ శాంతిభద్రతలు పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి కురసాల కన్నబాబు, జనసేన పార్టీ అభ్యర్థి పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, కాంగ్రెస్ అభ్యర్థి పిల్లి సత్యలక్ష్మి, జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ మండలంలో పర్యటించి పోలింగ్ సరళిని పరిశీలించారు. కరపలో జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఇతర గ్రామాల్లో ప్రజాప్రతినిధులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.


కరపలో ఓటు వేసినట్టు చూపుతున్న దివ్యాంగుడు


కరపలో వీల్‌చైర్‌లో వృద్ధురాలిని తీసుకువస్తున్న ఫెసిలిటేటర్


కరపలో ఓటు వేసినట్టు చూపుతున్న ఎంపీపీ శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ భీమేశ్వరరావు


నడకుదురులో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు

ఎన్నికల చిత్రాలు





పిఠాపురం మండలం విరవాడలో ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధులు


పిఠాపురం మండలం విరవలో కొత్త ఓటర్లు


విరవలో తల్లి ఓటు వేసేందుకు వెళ్లడంతో పిల్లలతో ఉన్న తండ్రి

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం


వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు తదితరులు

అమలాపురం రూరల్: కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో నవమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి వేంకటేశ్వర స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నిత్య హోమాలు, అర్చన, లక్ష్మీ హోమం, నీరాజన మంత్ర పుష్పం వంటి పూజలు జరిపారు. అమ్మవార్లకు మహిళలు సామూహిక కుంకుమ పూజ చేశారు. కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు), ఎండీలు రవికిరణ్ వర్మ, శశికిరణ్ వర్మ దంపతులు కల్యాణం జరిపించారు. మంగళవారం ఉదయం సుదర్శన హోమం, పూర్ణాహుతి, చక్రస్నానం తదితర కార్యక్రమాలు, స్వామి వారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు.